క్లుప్తంగా

ఇఫ్తార్ విందులో పాల్గొన్న మక్బూల్ అహ్మద్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న బీఎస్ మక్బూల్ అహ్మద్, వజ్రభాస్కర్‌రెడ్డి

కదిరి అర్బన్: పట్టణంలోని అక్సా మసీదులో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్‌సీపీ కదిరి సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్రభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. నాయకులు పరికి సాధిక్, పలువురు కౌన్సిలర్లు, మత పెద్దలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



బస్టాండ్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీసీ డీఎం సత్యనారాయణ

ధర్మవరం అర్బన్: ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయమని ఆర్టీసీ డీఎం సత్యనారాయణ తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డీఎం మాట్లాడుతూ.. ప్రయాణికులు నిత్యం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు బస్టాండ్‌కు వస్తుంటారని తెలిపారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ప్రయాణికుల దాహార్తి తీర్చడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, ట్రెజరర్ వంకదారి మోహన్, సభ్యులు డాక్టర్ బీవీ సుబ్బారావు, చాంద్ బాషా, రమేష్ బాబు, సత్రసాల మల్లికార్జున, ఓవీ ప్రసాద్, శ్రీనివాసులు, సికిందర్, కేతా లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

కదిరిలో ట్రాఫిక్ ఆంక్షలు

కదిరి టౌన్: పట్టణంలో సోమవారం రంజాన్ సందర్భంగా ఈద్గా వద్ద ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేమారెడ్డి సర్కిల్ నుంచి ఎలాంటి భారీ వాహనాలు, కార్లు, ఆటోలకు హిందూపురం వైపు వెళ్లేందుకు అనుమతి లేదన్నారు. వృద్ధులు, దివ్యాంగులు మాత్రమే నమాజు చేసేందుకు పోలీస్‌లైన్‌కు ఎదురుగా ఉద్గాగేటు వద్ద మోటారు సైకిల్ లోపలికి వెళ్లందుకు అనుమతి ఉంటుందన్నారు. అక్సారియా మసీదు ఎదుట మెయిన్ రోడ్డు పోలీస్ లైన్ వద్ద నుంచి టవర్‌క్లాక్ వరకు ఎలాంటి వాహనాలకు అనుమతి లేదన్నారు.

మాజీ సర్పంచ్ కటకం ఓబుళరెడ్డి మృతి



మాజీ సర్పంచ్ కటకం ఓబుళరెడ్డి (ఫైల్)

గాండ్లపెంట: మండలంలోని తూపల్లి పంచాయతీ వంకపల్లిలో మాజీ సర్పంచ్ కటకం ఓబుళరెడ్డి (89) ఆదివారం మృతి చెందాడు. తూపల్లి పంచాయతీ ఏర్పాటుకాక ముందు గాండ్లపెంట ఉమ్మడి పంచాయతీ సర్పంచ్‌గా కొనసాగారు. పెద్ద కుమారుడు భాస్కర్‌రెడ్డి జెడ్పీటీసీగా పనిచేశాడు. రెండో కుమారుడు చంద్రశేఖరరెడ్డి తూపల్లి సర్పంచుగా పనిచేశాడు. భాస్కర్‌రెడ్డి భార్య అమరావతి ప్రస్తుత గాండ్లపెంట జెడ్పీటీసీ గా కొనసాగుతున్నారు. మాజీ సర్పంచ్ మృతికి పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, మండల కన్వీనర్, మాజీ కన్వీనర్‌లు, మాజీ సర్పంచ్‌లు, పలువురు ప్రజాప్రతినిధులు ఆయన మృత దేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు వంకపల్లిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఉగాది శోభ



పోట్లమర్రిలో పూజలందుకున్న ఆంజనేయ స్వామి



అలంకరణలో గంగమ్మ దేవత



అలంకరణలో ఓంకారేశ్వరుడు,



ధర్మవరం అర్బన్: అలంకరణలో లింగశెట్టిపాళ్యం ఆంజనేయుడు

ధర్మవరం అర్బన్: పట్టణంలో ఆదివారం ఉగాది పండుగ సందడి నెలకొంది. ఇళ్లను మామిడి తోరణాలు, వేపాకుతో అలంకరించారు. ఉగాది పచ్చడి, పిండి వంటకాలను ఆరగించారు. పట్టణంలోని దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. కొత్తపేట వేంకటేశ్వర స్వామి, షిర్డీ సాయిబాబా ఆలయం, శ్రీనివాసనగర్ వేంకటేశ్వర స్వామి, కన్యకా పరమేశ్వరీ దేవి, దుర్గమ్మ దేవి, చెన్నకేశవ స్వామి, లింగాశెట్టిపాళ్యం ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో అర్చకులు పంచాంగం వినిపించారు.

బత్తలపల్లి: మండలంలో ఉగాది పర్వదినాన్ని ఆదివారం మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లకు మామిడి తోరణాలు కట్టి, పచ్చడి చేసుకుని సందడిగా గడిపారు. బత్తలపల్లిలోని లలితా త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వర స్వామి, కొల్లాపురమ్మ, బళ్లారి దుర్గమ్మ, అంకాలమ్మ, గంగమ్మ ఆలయాల్లోనూ, పోట్లమర్రిలోని మల్లేశ్వరాలయంలో పూజలు జరిగాయి. ఆంజనేయస్వామి, నలలమ్మ ఆలయాలు, ముష్టూరులోని ఆంజనేయ స్వామి, శివాలయాలు, గంటాపురంలో గురజాల అప్పస్వామి, మాల్యవంతం, రామాపురం వీర నారాయణ స్వామి దేవాలయల్లో, డి.చెర్లోపల్లిలోని సిద్ధేశ్వరాలయం, దంపెట్ల చెన్నకేశవాలయం, సంఘమేశ్వర క్షేత్రం, కాటికోటేశ్వరక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. పరమటి వీరన్న స్వామికి వాహనాలు, ఎద్దుల బండ్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయం వద్ద ప్రదక్షిణలు చేశారు. వివిధ గ్రామాల్లో కొబ్బరి కాయలు, చీనీ పండ్లు విసిరే పందేలు ఆకట్టుకున్నాయి.

కనగానపల్లి: మండల వ్యాప్తంగా ఆదివారం ఉగాది పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తొలుత లోగిళ్లను శుభ్రం చేసి ద్వారాలకు పచ్చని తోరణాలు కట్టి ప్రత్యేకంగా అలంకరించారు. ఇక మండలంలోని పలు దేవాలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశబూరు. కనగానపల్లిలోని సల్లాపురమ్మ, మారెమ్మ, మామిళ్లపల్లిలోని పెద్దమ్మ, దుర్గమ్మ, గంగమ్మ వంటి గ్రామ దేవతలకు కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఇక పరమటీరన్న, మరూరు చిన్నకదిరయ్య స్వాములకు భక్తులు పన్నెండు బండ్లు కట్టారు.

చెన్నేకొత్తపల్లి: శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగను మండల వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే స్నానాలు ఆచరించి మామిడి తోరణాలతో ఇంటి గుమ్మాలను అలంకరించారు. ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శిల్పారామంలో ఉగాది సంబరాలు

పుట్టపర్తి టౌన్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఎనుములపల్లి సమీపంలో ఉన్న శిల్పారామంలో ఉగాది సంబరాలను ఏఓ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం పురోహితుడు నాగరాజశర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది.

వేమన ఆలయంలో ప్రత్యేక పూజలు

గాండ్లపెంట: మండల పరిధిలోని కటారుపల్లి విశ్వకవి యోగి వేమన ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ పీఠాధిపతులు, గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు, భక్తులు స్వామి గొడుగులతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. మొక్కు తీరిన భక్తులు సమాధి ఎదుట పొర్లుదండాలు పెట్టారు. కార్యక్రమంలో కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, ఆలయ పీఠాధిపతులు వేమారెడ్డి (వైట్ రెడ్డి), నందవేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా ఏప్రిల్ 6 నుంచి 8వ తేది వరకు వేమన బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు.



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు



స్వామి గొడుగులను ప్రదక్షిణలు చేయిస్తున్న ఆలయ పీఠాధిపతులు



ఖాద్రీశుడికి పూజలు

రంజాన్ శుభాకాంక్షలు

- మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



పుట్టపర్తి టౌన్: నియోజకవర్గంలో ఉన్న ముస్లింలందరికీ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణ, దాతృత్వం, ఆధ్యాత్మిక చింతన కలయికే రంజాన్ అని పేర్కొన్నారు. ప్రజలందరికీ అల్లా చల్లని దీవెనలు అందించి సకల శుభాలు కలుగజేయాలని ఆకాంక్షించారు.

కదిరి టౌన్: నియోజకవర్గంలోని ముస్లింలకు వైఎస్సార్‌సీపీ కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి ఆదివారం రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం రంజాన్‌ను పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ పండుగ బాగా జరుపుకోవాలని, సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు.

ఖాద్రీ ఆలయంలో పంచాంగ పఠనం



పంచాంగ పఠనం చేస్తున్న అర్చకులు

కదిరి టౌన్: తెలుగు సంవత్సరాది (విశ్వావసు నామ సంవత్సరం) ఉగాది పండుగ సందర్భంగా ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి 8 గంటలకు పంచాంగ పఠనం, స్వామివారికి ఊంజల్‌సేవ నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురిసి, పంటలు బాగా పండుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, పట్టణ ప్రముఖులు హాజరయ్యారు.

వైభవంగా చౌడేశ్వరీ దేవి బ్రహ్మరథోత్సవం



చౌడేశ్వరీదేవి బ్రహ్మరథోత్సవం సాగుతున్న దృశ్యం

లేపాక్షి: మండలంలోని చోళసముద్రంలో వెలసిన చౌడేశ్వరీదేవి బ్రహ్మరథోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా సాగింది. ఉదయం మూలదేవతా ప్రార్థన, గణపతి పూజ, స్వస్తి వాచన, పంచగవ్య అరాధన, రక్షాబంధన, కలశ స్థాపన, దేవతా ఆవాహన, అగ్ని ప్రతిష్టాపన, నవగ్రహ శాంతి హోమం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేశారు. మధ్యాహ్నం 1.30 గంటలకు పూర్ణాహుతి, మహామంగళారతి ఇచ్చారు. అనంతరం చౌడేశ్వరిదేవి ఉత్సవ విగ్రహాన్ని రథంపై కొలువుతీర్చి బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహించారు. దేవాలయం నుంచి పంచాయతీ ఆవరణంలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయం వరకూ ఊరేగింపు చేశారు. బిసలమానేపల్లికి చెందిన లోకేష్ భక్తులకు అన్నదానం చేశారు. అమ్మవారి భక్తులు రమేష్, శీన, రామకృష్ణయ్యశెట్టి తదితరులు భక్తులకు మజ్జిగ, ప్రసాదాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా లేపాక్షి దేవాలయం కమిటీ చైర్మన్ కరణం రమానందన్ హాజరై పూజలు చేయించారు. మాజీ మండల కన్వీనర్ నారాయణస్వామి, గ్రామ పెద్దలు ప్రభాకర్‌రెడ్డి, గోపాల్‌కృష్ణ, జయచంద్ర, నరసింహమూర్తి, చెన్నకృష్ణ, మోహన్, భరత్, రంగనాయకులు, కూతులు శీన, వెంకటేశ్, నానేప్ప, చంద్ర, క్రిష్టప్ప పాల్గొన్నారు.

లైంగిక నేరాలకు పాల్పడితే చర్యలు



పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్న జడ్జి జె.సుజిన్ కుమార్

రాప్తాడు: బాల, బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని స్పెషల్ జ్యుడిషియల్ మొబైల్ కోర్టు జిల్లా జడ్జి జె.సుజిన్ కుమార్ హెచ్చరించారు. రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు, మహిళలకు పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. 18 సంవత్సరాల బాల, బాలికలపై లైంగిక వేధింపులు, లైంగిక నేరాలను నివారించేందుకు ఈ చట్టం 2012లో రూపొందించడం జరిగిందన్నారు. ఎన్ని చట్టాలు ఉన్నా ఏదో ఒక చోట చిన్న పిల్లలు లైంగిక దాడులకు గురవుతూనే ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బాల, బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై తెలుసుకోవాలని సూచించారు. ఎవరైనా లైంగిక దాడులు, నేరాలకు పాల్పడితే వారికి శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. మహిళలు ఇతరులు చెప్పే మాటలు విని మోసపోకుండా ఉండాలన్నారు. మహిళలకు అన్యాయం జరిగినప్పుడు అధైర్య పడకుండా ముందడుగు వేసి న్యాయస్థానాల్లో సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాంబశివుడు, సీఐ శ్రీహర్ష, విద్యార్థులు, స్వయం సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్ పగడాల మృతి బాధాకరం



ర్యాలీ చేపట్టిన క్రైస్తవులు

అనంతపురం కల్చరల్: అనుమానాస్పదంగా మృతి చెందిన క్రైస్తవ ప్రబోధకుడు ప్రవీణ్ పగడాల సేవలు చిరస్మరణీయమని పలువురు క్రైస్తవ పెద్దలు కొనియాడారు. రెవరెండ్ ప్రవీణ్ అకాల మరణానికి సంతాపంగా నగరంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ చేపట్టారు. స్థానిక కోర్టు రోడ్డులోని గాస్పెల్‌హాలు వద్ద పాస్టర్ వరప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలతో ర్యాలీని ప్రారంభించారు. అనంతరం క్లాక్‌టవర్ మీదుగా సప్తగిరి సర్కిల్ వద్ద ఉన్న ఎస్‌ఐయూ చర్చి వరకూ ర్యాలీ కొనసాగింది. ప్రవీణ్ పగడాల మృతికి సంతాపం ప్రకటిస్తూ సాగిన ర్యాలీని పాస్టర్ బెన్హర్‌బాబు, రెవరెండ్ సంపత్‌కుమార్ సందేశంతో ముగించారు. ప్రభుత్వం సమగ్ర దర్యాప్తుతో క్రైస్తవులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ల సంఘం అధ్యక్షుడు, దైవజనులు నెహెమ్యా నాగరాజు, మోజెస్ అనిల్‌కుమార్, ఐజయ్య, రఘునాథ్ డేనియల్, ఏసీసీసీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, ఏబీసీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొఠారి విక్టర్ డేనియల్, విల్సన్, కమలాకరావు, షీబా జయరాజ్, స్వామిదాసు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి వెండి వితరణ

హిందూపురం: పట్టణంలోని వాసవీ కన్యాకాపరమేశ్వరీ ఆలయంలోని మూలవిరాట్ వాసవీ మాత బంగారు విగ్రహం వెనుక వెండి ప్రభావళి, పీఠం నిర్మాణానికి 3.5 కేజీల వెండిని దాతలు అందజేశారు. తాతామల్లికా రామనాథగుప్తా, లక్ష్మీ, వినయ్ కుటుంబ సభ్యులు ఆర్యవైశ్య సంఘం చైర్మన్ జేపీకే రాముకు ఆదివారం వెండి అందించారు. కార్యక్రమంలో కోశాధికారి రవీంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మ ఊరేగింపు



ముత్యాలమ్మ దేవతను ఊరేగిస్తున్న దృశ్యం

లేపాక్షి: మండలంలో ప్రసిద్ధి గాంచిన గొంగటిపల్లి ముత్యాలమ్మ ఊరేగింపును ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఏడాది ఉగాది పండుగను పురస్కరించుకుని గ్రామ పెద్దల సమక్షంలో అమ్మవారిని ఊరేగింపు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగానే ఈసారి కూడా ఊరేగింపును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి నుంచి టెంకాయ, పూలు, పసుపు కుంకుమలను అమ్మవారికి ఇచ్చి భక్తిని చాటుకున్నారు. ముందుగా లేపాక్షిలోని ఊరి వాకిలి వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోకి అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు.

వ్యక్తికి గాయాలు

పెనుకొండ రూరల్: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి గాయపడిన సంఘటన అమ్మవారిపల్లి సమీపంలో చోటు చేసుకుంది. కియా ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. పెనుకొండ 44వ జాతీయ రహదారిపై అమ్మవారిపల్లి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటే క్రమంలో అనంతపురం వైపు నుంచి బెంగళూరు వెళ్తున్న లారీ ఢీ కొనింది. ఈ ఘటనలో గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకొన్న ఎస్ఐ రాజేష్ సంఘటన స్థలానికి చేరుకొని 108 వాహనం ద్వారా హుటా హుటిన క్షతగాత్రుడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఘనంగా అక్కదేవతల ఉత్సవాలు



మేడాపురంలో లక్ష్మీనరసింహ స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ఒంటికొండ గ్రామంలో అక్కదేవతల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయాన్నే అక్కదేవతలు, చెన్నుడు, నరసింహస్వామిని గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి ఫల, పుష్పాలను సమర్పించి పూజలు చేయించారు. ఇక మేడాపురం గ్రామంలో కొలువైన లక్ష్మీనరసింహ స్వామికి భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేయించారు. స్వామి ప్రతిమలను గ్రామ సమీపంలోని కొండ నుంచి భక్తిశ్రద్ధలతో తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ప్రతిమలను ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామిని గ్రామంలోని వీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు.



అలంకరణలో ఓబుల లక్ష్మీనరసింహ స్వామి



ఒంటికొండలో అక్కదేవతలు, చెన్నుడు, లక్ష్మీనరసింహస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

రెండు ద్విచక్ర వాహనాల ఢీ

అమరాపురం: స్థానిక శిర రోడ్డులోని ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రహదారిలోని వంక వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఆదివారం రాత్రి ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు .. ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న పునిత్, పాత ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న అనిల్ ఎదురెదురుగా ద్విచక్ర వాహనాల్లో ఢీ కొన్నారు. ఇద్దరూ గాయపడగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనిల్‌కు తీవ్ర గాయాలు కాగ కుడి కాలు విరగడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం ఆస్పత్రికి తరలించారు. అలాగే స్వలంగా గాయపడిన పునిత్‌కు వైద్య సేవలు అందించారు.

● ట్రాఫిక్ అస్తవ్యస్తం



బత్తలపల్లి కూడలిలో స్తంభించిన ట్రాఫిక్



రోడ్డుపైనే వాహనాలను నిలిపిన దృశ్యం

బత్తలపల్లి: మండల కేంద్రంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. నాలుగురోడ్ల కూడలి వద్ద ఆటోవాలాలు రోడ్డుపైనే ఆటోలను ఆపుకుని ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. ఇక వ్యాపారులు కూడా రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేయడం, కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్డుపైనే ఉంచడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా తాడిపత్రి రోడ్డుపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం వాటిల్లుతుండటంతో మూడు రోడ్లపై వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోతున్నాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రేపు వారపు సంత వేలం

ఓడీచెరువు: మండల కేంద్రంలోని వారపు సంత, లోడింగ్ అన్‌లోడింగ్ బహిరంగ వేలం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏప్రిల్ 1వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు వారపు సంతకు యాభైవేల రుపాయలు, లోడింగ్ అన్‌లోడింగ్‌కు ఇరవై వేల రుపాయలు ధరావత్తు చెల్లించాలని సూచించారు.